

కృష్ణకాలనీ : పైలట్ కాలనీలో ప్రచారం చేస్తున్న గండ్ర జ్యోతి



రేగొండ : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# బీఆర్ఎస్‌కు ఓటేసి.. అభివృద్ధికి సహకరించండి

- కార్మికులకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే
- గండ్ర వెంకట రమణారెడ్డిని గెలిపించాలి
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

కృష్ణకాలనీ, నవంబర్ 13 : ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అభివృద్ధికి సహకరించాలని పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కోరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ సోమవారం టీబీజీకేఎస్ భూపాలపల్లి బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 27వ వార్డు పైలెట్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర జ్యోతి ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినా అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి 994 డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి ఇచ్చారన్నారు. అలాగే సీఎం కేసీఆర్ సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులకు 32శాతం లాభాల వాటా అందజేశారని గుర్తు చేశారు. ఎస్టీలకు 665 బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసి, సింగరేణి వ్యాప్తంగా 14వేల మందికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులకు నెలసరి జీతం ఇవ్వడమే కాకుండా డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తమ హక్కులను సాధించుకున్నా కార్మికులు వచ్చే ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు మల్లారెడ్డి, కనుకయ్య, రత్నం సమ్మిరెడ్డి, కొలిపాక నర్సింగరావు, భాసనపల్లి కుమారస్వామి, చక్రపాణి, నలిగేటి రమేశ్, లక్కాకుల శ్రీనివాస్, సురేశ్, చిలువేరు క్రాంతి, సంపత్, మహిళ నాయకులు పాల్గొన్నారు.

### గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో చేరికలు..

రేగొండ : కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దామరంచపల్లెకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండి రమేశ్ గౌడ్‌తో పాటు 20 మంది కార్యకర్తలు, అలాగే తిరుమలగిరికి చెందిన సీపీఐ నాయకుడు వీరేశ్, బీజేపీకి చెందిన గణేశ్‌తో పాటు 50 మంది కార్యకర్తలు గులాబీ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో మటిక సంతోష్, కట్లు మధుసూదన్ రెడ్డి, కడారి జనార్దన్, బండి కిరణ్, జూపాక నీలాంబరం, బీ సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇసుర్రాయి' కథకు అంతర్జాతీయ గుర్తింపు



శ్రీనివాసరాజు

వాజేడు, నవంబర్ 13 : తాను రాసిన బాలల కథ 'ఇసుర్రాయి'కి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకుడు, రచయిత డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కథ గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు బాలల కథల పుస్తకంలో స్థానం లభించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఏపీలోని కడపకు చెందిన జాని తక్కెడలశిల ఈ కథను 'ఏ హ్యాండ్‌మిల్' పేరుతో ఇంగ్లిషులోకి అనువదించారు. దీనితో పాటు మరో 19 కథల పుస్తకం 'టైనీ ట్రెజర్స్' పేరుతో అంతర్జాతీయ సంస్థ ప్రచురించింది. శ్రీనివాసరాజు రచన అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



భూపాలపల్లి పీఎస్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

## ఫిర్యాదులు ఓపిగ్గా విని పరిష్కరించాలి

- బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి
- ఎస్పీ కిరణ్‌ఖరే
- భూపాలపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

కృష్ణకాలనీ, నవంబర్ 13 : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఓపిగ్గా విని వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా పోలీసులు కృషి చేయాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పీఎస్‌ను తనిఖీ చేశారు. ఫిర్యాదులు, సమస్యలను డీఎస్పీ రాములు, ఎస్సై స్వప్న కుమారిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు సాధ్యమైనంత వరకు స్టేషన్ స్థాయిలోనే న్యాయం జరిగేలా పని చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి తమ పరిధిలోని ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై వారికి చేరువ కావాలన్నారు. వచ్చిన ఫిర్యాదులో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పీఎస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 5ఎస్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, తగు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూపిరెడ్డిపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగొండ, నవంబర్ 13 : మండలంలోని రూపిరెడ్డిపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణ పౌర సరఫరా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రేడ్ ఏ రూ. 2203, బీ గ్రేడ్‌కు రూ. 2183 చెల్లించడం జరుగుతుందన్నారు. ధాన్యంలో తేమ శాతం లేకుండా తీసుకురావాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణస్వామి,ఆర్ఐ నరేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

## బుగులోని జాతర ఏర్పాట్ల పరిశీలన

రేగొండ, నవంబర్ 13 : బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర ఏర్పాట్లను చిట్యాల సీఐ వేణుచందర్, రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని తిరుమలగిరి గ్రామం శివారు పాండవుల గుట్టపై ప్రతి ఏటా కార్తిక పౌర్ణ మి రోజు నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. జాతర ఈ నెల 27 నుంచి 30వరకు జరగనున్నాయి. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు రహదార్లు, తాగునీరు, వాహనాల పార్కింగ్, గుట్టపైన క్యూ వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. జాతర చైర్మన్ జనార్దన్, పోలీసులు ఉన్నారు.

## బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడిగా రాజేందర్

మల్హర్, నవంబర్ 13 : మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామ అధ్యక్షుడిగా ముత్యాల రాజేందర్‌ను నియమించినట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మంథని ఏఎంసీ వైస్ చైర్మన్ పుట్టపాక శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు ఆయూబ్‌ఖాన్, కొండంపేట సర్పంచ్ అడ్డూరి కుమారస్వామి, మండల ఉపాధ్యక్షుడు బాపు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, నవంబర్ 13 : మండలంలోని కొడవటంచ గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్రం సందర్భంగా అలయ ఆర్చకుడు బుచ్చామాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, యాగాలు చేశారు. అనంతరం స్వామి వారిని పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో బిళ్ల శ్రీనివాస్, ధర్మకర్తలు గైని కుమారస్వామి, పోగు సుమన్, సిబ్బంది కే రవీందర్, గోరంటల శ్రావణ్, రవి పాల్గొన్నారు.

## వాజేడులో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

వాజేడు, నవంబర్ 13 : మండల కేంద్రంతో పాటు మండలంలోని జంగాలపల్లి, నాగారం, జగన్నాథపురం, గుమ్మడిదొడ్డి ప్రగళ్లపల్లి గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారం ప్రజలను ఆకట్టుకుంది. వివిధ పార్టీలకు చెందిన వారిని వెంకట్రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకుపోతుంది.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వెంకట్రావు

## అంబరాన్నంటిన దీపావళి సంబురాలు

- సందడిగా మారిన గ్రామాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పటాకులు కాల్చి వేడుకలు

చిట్యాల/కాళేశ్వరం/ములుగురూరల్/ఏటూరునాగారం/గోవిందరావుపేట/కన్నాయిగూడెం, నవంబర్ 13 : మండల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో దీపావళి పండుగ సంబురాలు అంబరన్నంటాయి. ఆదివారం ప్రజలు ఇండ్ల ఎదుట దీపా లు వెలిగించి పటాకులు కాల్చి వేడుకలు చేసుకున్నారు. ఇండ్లకు రంగులు వేయించి, ముంగిళ్లలో కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. గుమ్మాలను బంతిపూలు, మామిడాకులతో అలంకరించారు. నోములు ఉన్నవారు కేదారేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి వ్రతాలు చేశారు. దీపావళి సందర్భంగా కొత్త అల్లుళ్లు, బంధువుల రాకతో గ్రామా లు సందడిగా మారాయి. పాడి పంటలు, పశు సంపద, ఆయురోగ్యాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. గోవిందరావుపేట మండలం లోని పస్రా పోలీస్‌స్టేషన్‌లో సీఐ శంకర్, ఎస్సై మస్తాన్, సీఆర్పీఎఫ్, సివిల్ సిబ్బంది పటాకులు కాల్చారు.



గోవిందరావుపేట : పస్రా పీఎస్‌లో దీపావళి సంబురాల్లో పాల్గొన్న పోలీసులు



సమ్మక్కను దర్శించుకుంటున్న అంజన్ చక్రబర్తి, వీకే సింగ్

## వనదేవతల సన్నిధిలో రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు

తాడ్వాయి, నవంబర్ 13 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మను ఆదివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు అంజన్ చక్రబర్తి, ఐఆర్ఎస్ వీకే సింగ్ దర్శించుకున్నారు. వారికి పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై ఓంకార్‌యాదవ్ స్వాగతం పలికారు. అమ్మవార్ల గద్దెలపై పసుపు, కుంకుమ, బెల్లం, వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అమ్మవారి వస్త్రాలు, ప్రసాదాన్ని పూజారులు అందజేశారు. అనంతరం రెండేళ్లకోసారి జరిగే అమ్మవార్ల మహాజాతర గురించి అడిగి తెలుసుకున్నారు.

### కాళేశ్వరంలో..

కాళేశ్వరం : కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని కరీంనగర్ ఎన్నికల అబ్జర్వర్ యోగేశ్ సుఖ్‌దేవ్ సోమవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా పూజలు చేశారు. వారికి అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అర్చకులు అశీర్వచనం చేసి స్వామి వారి కండువాతో సన్మానించారు.